
# చిరకాల స్వప్నం సాకారం



## రెవెన్యూ డివిజన్‌తోపాటు నాలుగు మండలాల ఏర్పాటు

- తాజాగా ప్రాథమిక నోటిఫికేషన్‌ను జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి అల్లోల, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి
- ప్రజలకు తగ్గనున్న దూరభారం, వ్యయం
- పటాకులు కాల్చి.. స్వీట్లు పంచుకొని సంబురాలు
- సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం

### మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే..



సాంవ్లి గ్రామం కుభీర్ మండల కేంద్రానికి చాలా దూరం ఉంటుంది. పరిపాలనా సౌలభ్యం కోసం 13 జీపీల సర్పంచ్‌లం తీర్మానాలు, సంతకాల సేకరణ చేసి ఎమ్మెల్యేకు అందజేశాం. మంత్రి అల్లోలతోపాటు సీఎం సార్ దృష్టికి తీసుకెళ్లి కొత్త మండలం అయ్యేట్లు ప్రయత్నం చేస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం మాలేగావ్ కొత్త మండలం అయింది.

**- రేకుల గంగాచరణ్, మార్క్‌ఫెడ్ స్టేట్ డైరెక్టర్, సాంవ్లి.**

### కల నెరవేరింది..



నాలుగేండ్లుగా మంత్రితోపాటు, కలెక్టర్, ఎమ్మెల్యేకు మా ఆవేదన తెలుపుతూ వచ్చాం. ఎమ్మెల్యేపై సర్పంచ్‌లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒత్తిడి పెంచారు. సీఎం కేసీఆర్ మా ఎమ్మెల్యే పలుమార్లు కలవడం, మండలాన్ని ఏర్పాటు చేయాలని కోరడంతో కల నెరవేరింది.

**- మహిపాల్, సర్పంచ్, మాలేగావ్.**

### దూరభారం తగ్గింది..




మేము కుభీర్‌కు రావాలంటే 22 కిలోమీటర్లు ప్రయాణించాలి. మండలం ఏర్పాటు చేయడంతో సమయంతోపాటు దూరభారం తగ్గింది. ఇప్పుడు ఐదు కిలోమీటర్లు మాత్రమే ప్రయాణిస్తే మా మండలానికి చేరుకుంటాం. ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు మా గ్రామస్తులందరి తరపున కృతజ్ఞతలు.

**- గుంచెటి లక్ష్మి, సర్పంచ్, నిగ్వ.**

# మాలేగావ్

## 13 జీపీలు, ఐదు అనుబంధ గ్రామాలు

మాలేగావ్ గ్రామము



కుభీర్, అక్టోబర్ 5 : నిర్మల్ జిల్లాలోని కుభీర్ మండలం 41 గ్రామ పంచాయతీ(జీపీ)లతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే అతిపెద్ద మండలంగా ఉంది. దీనికితోడు తండాలు, అనుబంధ గ్రామాలు కలుపుకుని 70కి పైగా గ్రామాలు ఉన్నాయి. విశాలంగా ఉండడం, చాలా గ్రామాలు మండల కేంద్రానికి దూరంగా ఉండడంతో పరిపాలన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో నాలుగేళ్లుగా మాలేగావ్ గ్రామాన్ని మండలం చేయాలంటూ 13 జీపీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు సంతకాల సేకరణ చేస్తున్నారు. పలుమార్లు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, మంత్రి ఐకేరెడ్డిలను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. దీనికితోడు మాలేగాం మాజీ సర్పంచ్ కచ్చకాయల శంకర్, ప్రస్తుత సర్పంచ్ మహిపాల్, నిగ్వ, కుప్టి, గోడాపూర్, హంపోలి గ్రామాల సర్పంచ్‌లు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిపై ఒత్తిడి తెచ్చారు. ఎమ్మెల్యే, మంత్రి కలిసి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. కేటీఆర్ కొత్త మండలం ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. సీఎం కేసీఆర్‌ను కూడా కలిసి కొత్త మండలం ఆవశ్యకతను తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు గత మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం మాలేగావ్‌ను మండలం చేస్తూ ప్రాథమిక నోటిపికేషన్‌ను జారీ చేసింది. తమ డిమాండ్‌ను నెరవేర్చిన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కేటీఆర్, సీఎం కేసీఆర్‌లకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

### 13 జీపీలు ఇవే..

మాలేగావ్ కొత్త మండలంలో 13 పంచాయతీలతోపాటు ఆరు అనుబంధ గ్రామాలు ఉండనున్నాయి. సాంవ్లి, న్యూ సాంవ్లి, సౌన, హంపోలి(బీ), మోల, అంతర్ని, పాంగ్ర, గోడ్సర, సొనారి, నిగ్వ, మాలేగావ్, గోడాపూర్, కుప్టి, అనుబంధ గ్రామాలు పాంగర్‌పాడ్, అంతర్ని తండా, బాకోట్, వర్ని, వాయి, లింగితో కొత్త మండలం ఏర్పాటు కానుంది.

### మంత్రి, ఎమ్మెల్యే కృషి వల్లే..



మంత్రి ఐకే రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కృషి వల్లే బెల్‌తరోడ మండలంగా ఏర్పాటైంది. ఐదు రోజుల క్రితం హైదరాబాద్‌లో ఐకే రెడ్డిని కలిసి బెల్‌తరోడ మండలం విషయంలో మాట్లాడాం. అల్లోల కూడా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించి ఏర్పాటు చేశారు. మండలం ఏర్పాటుకు కృషి చేసిన మంత్రివర్యులు తారక రామారావు, ఐకే రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి కృతజ్ఞతలు.

**- బాశెట్టి సాగరబాయి, జడ్పీ వైస్ చైర్మన్.**

### ప్రత్యేక ధన్యవాదాలు



2016 నుంచి బెల్‌తరోడను మండలంగా ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నాం. ముథోల్ ఎమ్మెల్యే మాకు ఇచ్చిన మాట ప్రకారం ఏర్పాటు చేయించారు. మండలం ఏర్పాటుకు సహకరించిన మంత్రి, ఎమ్మెల్యే, స్థానిక నాయకులకు రుణపడి ఉంటాం. వారికి ప్రత్యేక ధన్యవాదాలు.

**- గోప సాయినాథ్, సర్పంచ్, బెల్‌తరోడ.**

# బెల్ తరోడ

## 12 గ్రామాలు

తానూర్, అక్టోబర్ 5 : నిర్మల్ జిల్లా తానూర్ మండలంలో 31 గ్రామ పంచాయతీ(జీపీ)లు ఉన్నాయి. ఇందులోని 12 జీపీలతో బెల్‌తరోడాను మండలంగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. బెల్‌తరోడ గ్రామస్తులు, మండల అధ్యక్షురాలు, జడ్పీ వైస్ చైర్మన్‌తో కలిసి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, మంత్రి అల్లోలను కలిసి వినతిపత్రం అందించారు. ఇటీవల ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఐకే రెడ్డిలు ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. గత మంగళవారం బెల్‌తరోడ గ్రామాన్ని కొత్త మండలంగా ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. కొత్త మండలంలో బెల్‌తరోడ, భోసి, మహాలింగి, బామ్ని, బామ్నితండా, బొంద్రట్, ఝరి(బీ), ఝరి(బీ) తండా, బోల్సా, బోరిగాం, బెంబర్, ఉమ్రి(కే)లు ఉన్నాయి.



బెల్ తరోడ గ్రామ ముఖచిత్రం

### విఠల్‌రెడ్డిని మరువం..

ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి బెల్‌తరోడ గ్రామాన్ని కొత్త మండలంగా ఏర్పాటు చేయించారు. ఆయన ఒకసారి మాటిస్తే తప్పడు. గ్రామస్తులు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని ఎప్పుడు మరువరు. వారి వెంటే మేం ఉంటాం. మండలం ఏర్పాటుకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు.

**- బండారే పోశెట్టి, బీఆర్ఎస్ నాయకుడు, బెల్‌తరోడ.**



# చెన్నూర్ రెవె'న్యూ' డివిజన్..

- విప్ బాల్క సుమన్ చొరవతో ఏర్పాటు
- సర్వత్రా హర్షాతిరేకాలు

చెన్నూర్/కోటపల్లి, అక్టోబర్ 5 : చెన్నూర్ ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది. ప్రభుత్వ విప్ బాల్క సుమన్ చొరవతో చెన్నూర్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటైంది. ఈ డివిజన్ పరిధిలోకి చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాలతో పాటు కొత్తగా ఏర్పాటు కానున్న పారుపల్లి, అస్నాద్ మండలాలు కూడా రానున్నాయి. ఘన చరిత్ర ఉన్న చెన్నూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తే పాలన మరింత చేరువవుతుందని ఈ ప్రాంత ప్రజలు గత పాలకులను అనేకసార్లు కోరారు. ఇందుకు వారు స్పందించలేదు. బాల్క సుమన్ ఎమ్మెల్యే అయిన తర్వాత రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 1న మందమర్రి పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్‌తో ఈ అంశంపై మరోసారి మాట్లాడారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఆయన సర్కారు దృష్టికి తీసుకెళ్లి ఉత్తర్వులు జారీ చేయించారు. ఎట్టకేలకు కల నెరవేరడంతో చెన్నూర్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌తో మరింత ప్రగతి


చెన్నూర్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో మరింత ప్రగతి సాధించే అవకాశమున్నది. డివిజన్ స్థాయి కార్యాలయాన్నీ ఇక్కడికే వస్తాయి. ఇప్పటి వరకు మండలాల కార్యాలయాలు మాత్రమే ఉండగా, నూతన డివిజన్ కార్యాలయాలు అందుబాటులోకి వస్తాయి. ప్రజలకు పాలన మరింత చేరువ అవుతుంది. ఇది వరకు ఏ అవసరమొచ్చినా మంచిర్యాల జిల్లా కేంద్రానికి పరుగులు తీయాల్సి వచ్చేది. ఇకపై స్థానికంగానే పనులు చేసుకునే అవకాశముంటుంది.

### విప్ సుమన్‌కు రుణపడి ఉంటం



చెన్నూర్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజల కల నెరవేరింది. చెన్నూర్ రెవెన్యూ డివిజన్ కోసం గతంలో సాధన సమితి పేరిట ఉద్యమం చేసినా ఎవ్వరూ పట్టించుకోలేదు. పారుపల్లి, అస్నాద్ మండలాలు ఏర్పాటు చేయాలని కోరినా నిర్లక్ష్యం చూపారు. చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ప్రత్యేక కృషితో ఈ రోజు చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌తో పాటు పారుపల్లి, అస్నాద్ మండలాలుగా ఏర్పాడ్డాయి. ఇచ్చిన మాట నిలబెట్టుకొని దశాబ్దాల కల నెరవేర్చిన విప్ సుమన్ అన్నకు రుణపడి ఉంటాం. **- గుర్రం శ్రీనివాస్, చెన్నూర్**

చెన్నూర్ పట్టణం



### విప్ సుమన్‌కు ఈ ప్రాంతంపై ప్రత్యేక ప్రేమ



ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ప్రత్యేక కృషి వల్ల చెన్నూర్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటైంది. ఈ నిర్ణయంతో డివిజన్ స్థాయి కార్యాలయాలన్నీ ఇక్కడికే వస్తాయి. పట్టణం మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రజలకు పాలన మరింత చేరువవుతుంది. విప్ సుమన్ అన్నకు ఈ ప్రాంతంపై ఎంత ప్రేమ ఉందో మరోసారి నిరూపించుకున్నారు.

**- కన్యాలాల్ శ్యాంసుందర్ దేవ్‌డా, చెన్నూర్**

### ఇకపై ఎలాంటి బాధలుండవు



చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌తో పాటు పారుపల్లి, అస్నాద్ మండలాల ఏర్పాటు ఇక్కడి ప్రజల చిరకాల కోరిక. చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌తో పాటు ఈ రెండు గ్రామాలను మండలాలుగా ఏర్పాటు చేస్తే ప్రజలకు పాలన మరింత చేరువవుతుంది. కోటపల్లి మండలంలోని పారుపల్లి పరిధిలోకి వచ్చే గ్రామాలు, చెన్నూర్ మండలంలోని అస్నాద్ పరిధిలోకి వచ్చే గ్రామాలు మండలకేంద్రాలకు దూరంగా ఉండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ వచ్చారు. ఇకపై ఎలాంటి బాధలు ఉండవు. ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల ప్రత్యేక చొరవ వల్లే రెవెన్యూ డివిజన్, నూతన మండలాల ఏర్పాటు జరిగింది. వారికి ప్రత్యేక ధన్యవాదాలు. **- బాల్క సుమన్, ప్రభుత్వ విప్**

# పారుపల్లి..

## 23 గ్రామ పంచాయతీలు

# అస్నాద్

## 11 గ్రామ పంచాయతీలు

- కొత్త మండలాలు ఏర్పాటు చేస్తూ జీవో
- సర్వత్రా హర్షాతిరేకాలు
- సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం



మా తమ్ముడు బాల్క సుమన్ చెన్నూర్ నియోజకవర్గాన్ని సిద్దిపేట, సిరిసిల్లతో పోటీగా అభివృద్ధి చేస్తున్నాడు. చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌తో పాటు పారుపల్లి, ఆస్నాద్ మండలాలు కావాలని అడిగిండు. ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి రెవెన్యూ డివిజన్‌తో పాటు కొత్త మండలాలు చేసుకుందాం. ఎమ్మెల్యేగా ఉండి గిన్ని పనులు చేసిండు. దబ్బున రేపు కేసీఆర్ ఆశీర్వదించి తమ్ముడికి ప్రమోహన్ ఇస్తే చెన్నూర్ ఇంకెట్ల అవుతుందో మీరే అర్థం చేసుకోవాలి.

**- ఈ నెల 1న మందమర్రి సభలో మంత్రి కేటీఆర్**

కోటపల్లి, అక్టోబర్ 5 : అస్నాద్, పారుపల్లి ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది. ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఇచ్చిన మాట నిలుపుకున్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం అస్నాద్, పారుపల్లి మండలాలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సువిశాలమైన కోటపల్లి మండలాన్ని రెండు మండలాలుగా చేయాలని ప్రాణహిత, గోదావరి నది పరివాహక గ్రామాల ప్రజల కల. కానీ గత పాలకుల నిర్లక్ష్యంతో అది సాకారం కాలేదు. బాల్క సుమన్ ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే పారుపల్లి మండల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. కోటపల్లి మండలం అత్యధిక విస్తీర్ణం కలిగి ఉండడంతో.. దాన్ని రెండు మండలాలుగా విభజించాలని నిర్ణయించారు. పారుపల్లి మండల ఏర్పాటు ఆవశ్యకతను తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు రాష్ట్ర మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌ల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 1న మందమర్రిలో జరిగిన బహిరంగ సభలోనూ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌తో పాటు పారుపల్లి, అస్నాద్ మండలాల ఏర్పాటు గురించి ప్రముఖంగా ప్రస్తావించారు. రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఈ విషయంలో చొరవ చూపాలని కోరారు. ఇందుకు వెంటనే స్పందించిన మంత్రి కేటీఆర్ అదే వేగంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌తో పాటు పారుపల్లి, అస్నాద్ మండలాలు ఏర్పాటు చేసేలా నోటిఫికేషన్ జారీ చేయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జీవో విడుదల చేసింది. పారుపల్లి మండల పరిధిలోకి పారుపల్లి, పుల్లగామ, సిర్సా, ఎదుల్లబంధం, లింగన్నపేట, ఆలుగామ, రొయ్యలపల్లి, ఎర్రాయిపేట, బోరంపల్లి, కావరకొత్తపల్లి, అన్నారం, అర్జునగుట్ట, రాజారం, రాంపూర్, కొల్లూరు, రావులపల్లి, దేవులవాడ, రాపనపల్లి, పిన్నారం, వెలమపల్లి, లక్ష్మీపూర్, బబ్బెరచెలుక గ్రామాలు రానున్నాయి. ఇక చెన్నూర్ మండలంలోని అస్నాద్‌ను మండలంగా ఏర్పాటు చేయగా, దీని పరిధిలోకి అస్నాద్, గంగారం, కొమ్మెర, పొక్కూరు, పొన్నారం, సోమనపల్లి, నాగాపూర్, బీరవెల్లి, సుందరశాల, నర్సక్కపేట, దుగినెపల్లి గ్రామాలు వస్తున్నాయి.

### పారుపల్లి అభివృద్ధికి అవకాశం

నూతన మండలంగా ఏర్పాటు కానున్న పారుపల్లి అభివృద్ధిలో దూసుకుపోనున్నది. పారుపల్లికి ఆధ్యాత్మిక క్షేత్రంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. పారుపల్లి సమీపంలో పంచక్రోశ ఉత్తరవాహిణి ప్రవహిస్తుండడం, భైరవ కోనపై స్వయంభువుగా వెలిచిన భైరవుడు, భీమునిపాదం, పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయాలతో పాటు పాండవులు సంచరించిన ఆనవాళ్లు ఉండడంతో మరింత అభివృద్ధి చెందే అవకాశాలున్నాయి. నూతన మండలం పరిధిలోకి వచ్చే గ్రామాల గుండా జాతీయ రహదారి 63 వెళ్తుండడం, ప్రాణహిత, గోదావరి నదులు ప్రవహిస్తుండడం, ప్రాణహిత నదిపై బ్రిడ్జి తదితర అభివృద్ధి పనులు ఉండడం పారుపల్లి అభివృద్ధికి కలిసివచ్చే అవకాశం ఉంది. అలాగే అస్నాద్ కూడా మండల కేంద్రం అవుతుండడంతో ప్రగతిబాట పట్టనున్నది.

### తగ్గనున్న దూరభారం..

పారుపల్లి మండలం ఏర్పాటు కానుండగా, తూర్పు ప్రాంతంలో ఉన్న గ్రామాల ప్రజలకు దూరభారం తగ్గనున్నది. గతంలో మండలంలో 21 గ్రామ పంచాయతీలుండగా, కొత్తగా మరో 10 పంచాయతీలు ఏర్పడడంతో ఆ సంఖ్య 31కి చేరుకుంది. ఇందులోని 16 గ్రామపంచాయతీలు తూర్పు ప్రాంతంలో ఉండగా, కోటపల్లి మండలకేంద్రానికి సుమారుగా 20నుంచి 30కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఈ ప్రాంత ప్రజలకు కోటపల్లి మండలకేంద్రానికి దూరంగా ఉండగా, పారుపల్లి మండలంగా ఏర్పడితే దూరభారం తగ్గనున్నది. పారుపల్లి మండల ఏర్పాటు ప్రకటన వెలువడిన వెంటనే పారుపల్లితో పాటు రాంపూర్, సిర్సా, ఎదుల్లబంధం, ఆలుగామ, రాజారం, కొల్లూరు గ్రామాల ప్రజలు సంబురాలు చేసుకున్నారు. సిర్సాలో సర్పంచ్ పున్నంచంద్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పారుపల్లిని మండలంగా ఏర్పాటు చేయడంపై వైస్ ఎంపీపీ వాల శ్రీనివాస్ రావు, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు విద్యాసాగర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హర్షం ప్రకటించారు.



### మా కష్టాలు తీరినట్లే..

పారుపల్లి మండల ఏర్పాటుతో ఇగ మా కాష్టాలు తీరినట్లే. కోటపల్లి మండల కేంద్రం మా గోదావరి, ప్రాణహిత గ్రామాలకు దూరంగా ఉంటుంది. మండల కేంద్రానికి వెళ్లడం వ్యయప్రయాసలతో కూడుకున్న పని. దీంతో మేమంతా తీవ్ర ఇబ్బందులు పడుతూ వచ్చాం. విప్ బాల్క సుమన్ అన్న మా తిప్పలను చూసి పారుపల్లిని మండలంగా ఏర్పాటు చేయించిండు. ఇందుకు మేమంతా రుణపడి ఉంటం. పారుపల్లి.. మా గ్రామాలకు అతి దగ్గరగా ఉంటుంది. దీంతో ప్రభుత్వ పాలన మాకు చేరువ కానుంది.

**- దుర్గం ప్రదీప్, బోరంపల్లి**



### ఇది గొప్ప విజయం


ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఇచ్చిన మాట ప్రకారం చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌తో పాటు పారుపల్లి, అస్నాద్‌లను మండలాలుగా ఏర్పాటు చేయించారు. ఇది మాకు గొప్ప విజయం. విప్ ప్రత్యేక కృషి వల్ల పాలన చేరువ అవుతుంది. మా కల సాకారం చేసిన విప్ సుమన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

**- వాల శ్రీనివాస్ రావు, వైస్ ఎంపీపీ, కోటపల్లి**



### ప్రజల కోరిక నెరవేరింది

విప్ బాల్క సుమన్ పారుపల్లిని మండలంగా ఏర్పాటు చేయించి ప్రాణహిత, గోదావరి పరివాహక గ్రామాల ప్రజల గోస తీర్చిండు. ఆలుగామ నుంచి కోటపల్లి మండలకేంద్రానికి రోడ్డు, రవాణా సౌకర్యం లేకపోవడం చాలా ఇబ్బందులు పడుతూ వచ్చాం. ఇగ ఇప్పుడు మా ఇబ్బందులు పోయినట్లే. మేమంతా సీఎం కేఆర్, మంత్రి కేటీఆర్, విప్ సుమన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం. **- కుమ్మరి సంతోష్, ఆలుగామ, సర్పంచ్**



### మా విప్ మాట నిలబెట్టుకున్నడు

మా ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్న ఇచ్చిన మాట ప్రకారం పారుపల్లిని మండలంగా ఏర్పాటు చేయించారు. ప్రాణహిత, గోదావరి పరీవాహక గ్రామాల కేంద్రంగా ఉన్న పారుపల్లిని మండలంగా ఏర్పాటు చేయాలని ఎప్పటినుంచో అడుగుతున్నం. ఎంతో మంది నాయకులను కలిసినం. ఎవ్వరూ కూడా మా బాధను పట్టించుకోలే. ఇప్పుడు విప్ బాల్క సుమన్ అన్న మా కల నెరవేర్చిండు. పారుపల్లి మండలంతో పాటు చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, విప్ బాల్క సుమన్‌కు ధన్యవాదాలు.

**- పబ్బ అనిల్‌గౌడ్, పారుపల్లి**